క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి: పట్టణంలో శుక్రవారం నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు బీఆర్ఎస్ నుంచి మరోసారి అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు కాంతయ్య, గంగాధర్, బుచ్చన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

పచ్చదనం కోసమే మెగా ప్లాంట్



గుంతలను పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: పట్టణాలు పచ్చదనంతో కనువిందు చేస్తూ ఆహ్లాదాన్ని పంచేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో మెగా ప్లాంటేషన్ కోసం ఎంపిక చేసిన ప్రాంతాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలు తవ్వుతున్న గుంతలను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న మెగా ప్లాంటేషన్ కార్యక్రమం చేపడుతున్నామని, దీనిలో భాగంగా 1000 మొక్కలు నాటేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ తదితరులున్నారు.

'దళితుడిని హత్య చేసిన దుండగులను శిక్షించాలి'



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణానికి చెందిన కన్నం సతీశ్‌ను హత్య చేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు మెట్‌పల్లి డీఎస్పీ రవీంద్రరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సతీశ్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద సతీశ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛ గ్రామాలు

మల్లాపూర్: పారిశుధ్య కార్యక్రమాలతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో జగదీశ్ అన్నారు. మల్లాపూర్‌తో పాటు అన్ని గ్రామాల్లో అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వనీటిని తొలగించడం, చేతులు కడుక్కోవడంలో మెలకువలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పల్లెప్రగతి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తుండడంతో గణనీయ మార్పు చోటు చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలో ఇరుక్కుపోయిన ఆటో



కథలాపూర్: మేడిపెల్లి మండలం కొండాపూర్ – రంగాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలో శుక్రవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో టైరు ఇరుక్కుపోయింది. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీలు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో ఆకస్మాత్తుగా గుంతలో ఇరుక్కుపోవడంతో ఒకవైపు వంగింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలకు స్వల్ప గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అధికారులు చొరవ చూపి రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చివేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కోరుట్ల: సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



కథలాపూర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

జగిత్యాలజోన్/కోరుట్ల/ పెగడపల్లి /రాయికల్/కథలాపూర్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు జరిపించారు. మహిళలు లక్ష్మీ పూజలు చేసి ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు. ఆలయాల్లో జరిగిన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



రాయికల్ వాసవిమాత ఆలయంలో మహిళల పూజలు

గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సంజయ్‌కుమార్‌ను కలిసిన సర్పంచులు

రాయికల్: జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా సంజయ్‌కుమార్‌ను ప్రకటించడంతో శుక్రవారం రాయికల్ మండల సర్పంచులు, యువజన సంఘ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జక్కుల రంజిత్, కార్యదర్శి హరికృష్ణ, సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్, బెజ్జంకి మోహన్, అజారొద్దీన్, లక్ష్మీనారాయణ, రాజేశం, రాజమౌళి, సామల్ల వేణు, రవిగౌడ్, బెక్కం తిరుపతి, పాదం రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఆర్డీఏ పీడీ

జగిత్యాల: ఇటీవల డీఆర్డీఏ పీడీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ పీడీ నరేశ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పింఛన్ లబ్ధిదారుల్లో కోరుట్లదే అగ్రభాగం

• ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



పొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల: పింఛన్ లబ్ధిదారుల్లో కోరుట్ల నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్ర భాగాన నిలిచిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణంలోని కటుకం సంపయ్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీడీ టేకేదార్లకు రూ.3016 పింఛన్ ప్రొసీడింగ్ పత్రాలతో పాటు, వికలాంగులకు పెరిగిన రూ.4016 పింఛన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందిస్తున్నామన్నారు. తొమ్మిదేళ్లుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపానన్నారు. తన కుమారుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలో ఉంటున్నాడని, సంజయ్‌ను గెలిపిస్తే ఎమ్మెల్యేగా, డాక్టర్‌గా నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తాడన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ సుజాత, అన్నం లావణ్య, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్,అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ భవనానికి గాంధీజీ పేరు పెట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైశ్యులు

కోరుట్ల: నూతన పార్లమెంట్ భవనానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెట్టాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వైశ్య బంధు పథకాన్ని ప్రవేశపెట్టి వైశ్యులకు ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేష్, పట్టణ అధ్యక్షుడు కొత్త సుదీర్, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: పార్లమెంట్ భవనానికి మహాత్మా గాంధీ పేరు పెట్టాలని మండల ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజన్న, ప్రధానకార్యదర్శి యాసాల మల్లికార్జున్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి మహాత్మాగాంధీ పేరు పెట్టాలని తహసీల్దార్ ప్రసాద్‌కు శుక్రవారం ఆర్యవైశ్యులు వినతిపత్రం అందచేశారు. రాష్ట్రంలో నిరుపేద ఆర్యవైశ్యులకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జక్క దయాకర్, కార్యదర్శి హరీశ్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

రాయికల్: పార్లమెంట్ భవనానికి మహాత్మాగాంధీ పేరు పెట్టాలని పేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని, వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం రాయికల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు గంప ఆనందం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెగడపల్లి: నిరుపేదల ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వైశ్యులను ఆదుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ ఎంఏ ఫరూక్‌నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టి విస్మరించడన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు సురేశ్, లవకుమార్, రమేశ్, శ్రీనివాస్, శ్రీధర్, కిషన్, లింగన్న, చంద్రశేఖర్, భాస్కర్, మల్లేశం పాల్గొన్నారు.

బీజేపీకి అండగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీకి అండగా ఉంటూ మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కోరారు. శుక్రవారం మండలంలోని ఎర్దండిలో గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బట్టు జకరయ్య, మండల కార్యదర్శులు బాశెట్టి గణేశ్, రణధీర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు నిరేటి రవి, నాయకులు దాసరి రాజేందర్, గంగాధర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

మల్లాపూర్: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదేశాల మేరకు మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు, కో–కన్వీనర్లను నియమించినట్లు సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ముల రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లాపూర్ కన్వీనర్‌గా అల్లెపు నరేశ్, కో–కన్వీనర్‌గా చింతలూరి రాజేశ్‌ను, అన్ని గ్రామాలకు కన్వీనర్లను నియమించినట్లు పేర్కొన్నారు.

సేవాలాల్ మహరాజ్ విగ్రహాలకు విరాళం

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఎస్ఆర్‌ఐ భైర దేవ్‌యాదవ్ శ్రీ సేవాలాల్ మహరాజ్, జగదాంబ మేరమా యాడి విగ్రహాలకు రూ. 1,21,116 విరాళంగా శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భైర హేమలత, మల్లేశ్, రవినాయక్, నాయకులు మెగ్యానాయక్, తిరుపతినాయక్, బక్క్యా, పంతుల్‌నాయక్, రాజేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

జగిత్యాలరూరల్: పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పులి మల్లేశం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులకు గత 5–8 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, అన్ని గ్రామపంచాయతీల్లో సిబ్బంది వేతనాలను విడుదల చేసేలా ఎంపీవోలు దృష్టి సారించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు సిబ్బందికి ఇప్పించేందుకు కార్యదర్శులను వెంటనే ఆదేశించాలన్నారు. కార్మికులకు ఉన్న పెండింగ్ వేతనాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే చెల్లించాలని కోరారు.

అన్ని భాషలకు మూలమే సంస్కృత భాష

మెట్‌పల్లి: అన్ని భాషలకు మూలమే సంస్కృత భాష అని సంస్కృత భారతి సంస్థ ప్రాంత సహ కార్యదర్శి మోహన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విశ్వ సంస్కృత భాష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంస్కృత భాషను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని, విజ్ఞానాన్ని సంపాదించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భగవద్గీత,రామాయణం, ఉపనిషత్తులు, పలు ఇతిహాసాలన్నీ సంస్కృత భాషలోనే కవులు రచించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వెంకయ్య, రాజేందర్, మనోజ్, మధు, గట్టయ్య, అంజయ్య, గణేశ్ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల యూనిట్లు పంపిణీ

కథలాపూర్: మండలకేంద్రంలో యాదవులకు రెండో విడత గొర్రెలను ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే రెండో విడత 12 గొర్రెల యూనిట్లు కథలాపూర్ గ్రామానికి చెందిన యాదవులకు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వీటిని లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, పశువైద్యాధికారి దివ్యశ్రీ, పీఏసీఎస్ కట్కూరి రమేశ్, సర్పంచ్ కంటె నీరజ, ఎంపీటీసీ గసికంటి లత, నాగేశ్వర్ రావు, యాదవులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి

మల్లాపూర్ : ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ అడిషనల్ సెక్రటరీ మోర బద్రేశం అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో లయన్స్‌క్లబ్ సభ్యులకు బీపీ చెకప్, షుగర్ టెస్టింగ్ మిషన్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు బీపీ, షుగర్ వ్యాధుల పట్ల ప్రజలందరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, అధ్యక్షుడు కనుక సంజీవ్, సభ్యులు పుప్పాల మహేష్, గడ్డం శ్రీనివాస్, మోర సతీష్, కనుక నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో శుక్రవారం మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు డాక్టర్ గండ్ర దిలీప్ రావు, కోరుట్ల అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్ పాల్గొన్నారు.

'బంధు స్కీములు కాదు.. భవిష్యత్ కావాలి'

గొల్లపల్లి: ఉచిత స్కీములు కాదని పిల్లల ఉజ్వల భవిష్యత్ కావాలని, బహుజన రాజ్యంతోనే బడుగుల బతుకుల్లో మార్పు సాధ్యమని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల అధ్యక్షుడు కల్లెపెల్లి తిరుపతి, మండల నాయకులు విల్సన్, అర్జున్‌ల ఆధ్వర్యంలో గొల్లపల్లి మండలం రాపల్లిలో గడప గడపకు గజరాజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల సెక్రటరీగా ఉన్నప్పుడు పేద పిల్లలకు చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ఆధిపత్య పార్టీల నాయకులు ఎన్నికలు రాగానే రావడం పింఛన్, రైతు బంధు, దళిత బంధు, బీసీ బంధులంటూ ఆశలు చూపి అభివృద్ధిని బొందబెట్టి, మా ఓట్లను దండుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బుగ్గారం మండల అధ్యక్షుడు గజ్జెల స్వామి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ విజయం సాధించడానికి కష్టపడాలి

• నిజామాబాద్ ఎంపీ అర్వింద్



ఎంపీ అర్వింద్‌ను కలిసిన బీజేపీ నాయకులు

సారంగాపూర్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడానికి పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని నిజామాబాద్ ఎంపీ డి. అర్వింద్ అన్నారు. బీజేపీ మండల ప్రతినిధులు శుక్రవారం ఎంపీ అర్వింద్ ను ఆర్మూర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత.పార్టీని విజయం వైపు నడిపించడానికి ఐక్యతతో ముందుకు సాగాలని, దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు బద్దెల గంగరాజం, లెక్కల సందీప్, బొమ్మకంటి ప్రమోద్, నదీమ్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్త కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ అధ్యక్షుడు దుంపల రాజిరెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ధర్మపురి ఫౌండేషన్ బూత్‌స్థాయి సభ్యుల సంక్షేమ నిధి నుంచి శుక్రవారం రూ.లక్ష చెక్కును రాజిరెడ్డి సతీమణి లలితకు ఎంపీ ధర్మపురి అర్వింద్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ రాజనాల మధుకుమార్, రామాజీపేట ఎంపీటీసీ ఆకుల మహేశ్, ఐటీసెల్ మండల కన్వీనర్ మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు దుగ్యాల లక్ష్మీపతిరావు శుక్రవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు.

బీఆర్ఎస్ నాయకుల మాటల గారడి

• అస్సాం ఎమ్మెల్యే హేమాంగ్ ఠకారియా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హేమాంగ్ ఠకారియా

కథలాపూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల గారడితో కాలయాపన చేసిందే తప్ప అభివృద్ధి చేయలేదని అస్సాం ఎమ్మెల్యే బీజేపీ నియోజకవర్గ పరిశీలకులు హేమాంగ్ ఠకారియా అన్నారు. శుక్రవారం కథలాపూర్, మేడిపెల్లి మండలకేంద్రాల్లో వేర్వేరుగా నిర్వహించిన బీజేపీ ప్రవాస్ యోజనలో పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తుంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం తామే చేస్తున్నట్లుగా ప్రచారం చేస్తుండటం బాధాకరమన్నారు. అవినీతిమయమైన ప్రభుత్వానికి చరమగీతం పాడాలని ప్రజలు చూస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కో కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి, మేడిపెల్లి, కథలాపూర్ మండలాల అధ్యక్షులుశ్రీనివాస్, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి

మెట్‌పల్లి: డబుల్ ఇంజిన్ సర్కార్ తోనే ఇటు రాష్ట్రంలో అటు దేశంలో అభివృద్ధి సాధ్యమని మహారాష్ట్ర యావత్‌మాల్ ఎమ్మెల్యే మదన్ ఎర్వార్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్ లో నిర్వహించిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రమేష్, నాయకులు సుఖేందర్‌గౌడ్,నవీన్, ప్రభాకర్, వెంకట్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భూనిర్వాసితులతో ఆర్డీవో సమావేశం

కథలాపూర్: మేడిపెల్లి మండల పరిధిలో ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే వారితో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ తన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అభ్యంతరం తెలిపిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిబంధనల చట్టం ప్రకారం తాము భూసేకరణ చేస్తామని ఆర్డీవో రాజేశ్వర్ వారికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల్‌రావు, నాగరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఏర్పాటుకు సహకరించాలి

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అనుసూరిగూడెం, లంబాడితండా, కట్టకింది నాయికపుగూడెంలను గిరిజన గ్రామపంచాయతీ ఏర్పాటుకు బీర్‌పూర్ గ్రామస్తులు సహకరించాలని తండా గిరిజనులు కోరారు. శుక్రవారం బీర్‌పూర్‌లో సర్పంచ్ గర్షకుర్తి శిల్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుసూరిగుడెం, లంబాడితండా, కట్టకింది నాయికపుగూడెంలను కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడానికి తీర్మానం చేయాలని గిరిజనులు సమావేశంలో కోరారు. దీనిపై సుదీర్ఘ చర్చ జరిగింది. కొన్ని సాంకేతిక కారణాలతో తీర్మానం ఆలస్యం జరుగుతుందని, వచ్చే వారం మరోసారి చర్చించి తీర్మానం అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేష్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, ఉపసర్పంచ్ హరీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొసైటీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రాథమిక సహకార సంఘాలు అందించిన రుణాలను రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాల సింగిల్ విండో కార్యాలయంలో శుక్రవారం స్వల్పకాలిక రుణాల కింద మండలంలోని జగిత్యాల, లక్ష్మీపూర్, పొలాస, అంబారిపేట, తాటిపల్లి, బాలపల్లి, లింగంపేట గ్రామాల రైతులకు రూ.30 లక్షల రుణాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ సీఈవో వేణు, ఉపాధ్యక్షుడు శీలం సురేందర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి: సహకార సంఘం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు అన్నారు. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. సంఘం ద్వారా రైతుల అవసరం మేరకు సకాలంలో స్వల్పకాలిక, దీర్ఘ కాలిక రుణాలు, ఎరువులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ రూ. 20 కోట్ల టర్నోవర్ కలిగి ఉందన్నారు. సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన మండలాలకు పీహెచ్‌సీల మంజూరు

బుగ్గారం: బుగ్గారం,ఎండపెల్లి మండలాలకు పీహెచ్‌సీలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో నూతన మండలాలుగా ఏర్పడిన బుగ్గారం,ఎండపెల్లి ప్రజలకు వైద్య సదుపాయాలు మరింత చేరువకానున్నాయి. నూతన మండలాల్లో పీహెచ్‌సీలు ఏర్పాటు కానుండడంతో స్థానికంగా పలురకాల వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

రాయికల్: ఆశా కార్యకర్తలకు సమస్యలను పరిష్కరించి, రూ.18 వేల వేతనం చెల్లించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ ఖయ్యూంకు ఆశా కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18 వేల వేతనంతో పాటు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

జిల్లా పంచాయతీ అధికారులపై ఫిర్యాదు

బుగ్గారం: బుగ్గారం గ్రామపంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి అవినీతి,అక్రమాలను కప్పిపుచ్చిన ఆరుగురు జిల్లా పంచాయతీ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషాకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపించి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీపీ మండల్ జయంతి

జగిత్యాలటౌన్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో బీపీ మండల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండభేరి నరేశ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి భూమి రమణకుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగజల, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వరదసాయి, బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలి

జగిత్యాలక్రైం: విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని సీఐ రఫీక్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని ఇతరులకు మార్గదర్శకులు కావాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, ఆర్ఎస్సై కృష్ణ,సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.